విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 4, అక్టోబర్ 2023

వైద్యం కోసం ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-శింగనమల: శింగనమల నియోజకవర్గం నార్పల మండలం గూగూడు గ్రామంలో నివాసముంటున్న వరలక్ష్మికి అనారోగ్యంతో బాధపడు తుంటే మెరుగైన వైద్యం కోసం శింగనమల నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటి మాడుగు కేశవరెడ్డి మంగళవారం రూ.పదివేలు ఆర్థిక సహాయం చేశాడు. కార్యక్రమంలో నార్పల మండల నాయకులు శివరామ కృష్ణ, శ్రీరాములు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మానవ మృగాలను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర -రాయదుర్గం: భవ్య శ్రీని అత్యాచారం చేసి హత్య చేసిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల సిపిఐ, సిపిఎం, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎమ్మార్పీఎస్, కాంగ్రెస్, వడ్డర్ల, బీఎస్పీ, సిఐటియు ప్రజా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం రాయదుర్గం కళాశాల విద్యార్థినీలతో కలిసి స్థానిక వినాయక సర్కిల్లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిత్తూరు జిల్లా పెనమలూరు మండలం వేణుగోపాల పురానికి చెందిన వడ్డెర భవ్య శ్రీ అనే విద్యార్థిని అతి దారుణంగా ముగ్గురు యువకులు అత్యాచారం చేసి అత్యంత కిరాతకంగా హత మార్చి గుర్తు పట్టకుండా ఉండేందుకు గుండు గీసి కనుబొమ్మలను నాలుకను కోసి చంపడం హేయమైన చర్య అని విమర్శించారు. ఘటన జరిగి మూడు రోజులు గడిచినా స్థానిక ఎమ్మెల్యే రోజా కూడా ఒక మహిళగా స్పందించకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం వెంటనే ఆ రాక్షసులను అరెస్ట్ చేసే కఠినంగా శిక్షించాలని లేనిపక్షంలో ఆందోళనలో ఉధృతం చేస్తా మని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నాగార్జున, సిపిఎం తాలూకా కార్యదర్శి మల్లికార్జున, ఎమ్మార్పీఎస్ హరి గోపాల్, కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ వడ్డే జయన్న, బీఎస్పీ ఉల్లిగప్ప, వడ్డే సంఘం నాయకులు అధ్యక్షులు శ్రీనివాసులు, యూత్ అధ్యక్షుడు కేశవ్, ఏఐవైఎఫ్ కుమార్ నాయక్, యూత్ కాంగ్రెస్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

జిల్లాకు మరో భారీ పరిశ్రమ రాక..

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: జిల్లాలో మరో భారీ పరిశ్రమ ఏర్పాటు కానుంది. జిల్లాలోని రాయదుర్గం నియోజకవర్గంలోని డి.హీరేహాల్ మండలం జాజరకల్లు గ్రామం వద్ద మొక్కజొన్న, బియ్యం నూక ఆధారిత ఇథనాల్ డిస్టిలరీ పరిశ్రమ ఏర్పాటుకు ఈనెల 4వ తేదీన శ్రీకారం చుట్టను న్నారు. బుధవారం ఉదయం విజయవాడ నుంచి వర్చువల్ విధానంలో భూమి పూజ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించనున్నారు. అనంతపురం కలెక్టరేట్ నుంచి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి, ప్రజాప్రతినిధులు, జిల్లా పరిశ్రమ శాఖ అధికారులు, కంపెనీ ప్రతినిధులు, తదితరులు పాల్గొననున్నారు.

న్యాయమైన డిమాండ్లను నెరవేర్చండి

ఆర్‌డబ్ల్యూఎస్ కార్మికుల విజ్ఞప్తి ..

విశాలాంధ్ర-ఉరవకొండ: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించా లని ఉరవకొండ ఆర్డబ్ల్యూఎస్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు ఆర్డబ్ల్యూఎస్ డీఈ అంజుమన్ సుప్రీన్ కలిసి విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో డిఈని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కార్మికులు మాట్లాడుతూ 22 సంవత్సరాలుగా కాంటాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నప్పటికీ తమకు ఉద్యోగ, ఆరోగ్య భద్రత లేకుండా పోయిందని పేర్కొన్నారు, తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని బ్యాంకుల ద్వారా జీతాలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాలు తక్షణమే మంజూరు చేయాలని, ఈపీఎఫ్ 15 నెలలు ఈఎస్ఐ నెల నెల కట్టాలని ఐడి కార్డులు మంజూరు చేయాలని వారు. డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను ఈనెల 14వ తేదీలోపు పరిష్కరించని పక్షంలో 15వ తేదీన విధులను బహిష్కరిస్తా మని తెలిపారు.కార్యక్రమంలో కాంట్రాక్టు ఉద్యోగుల యూనియన్ నాయకులు శ్రీనివాసులు, మల్లికార్జున, లక్ష్మీనారాయణ, ఉమాపతి పాల్గొన్నారు.

ఎస్జీఎఫ్ పోటీల్లో ప్రతిభ..

విశాలాంధ్ర-రామగిరి: అనంతపురం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో వివిధ క్రీడాంశాల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు రామగిరి ఏపీ మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ సర్వేశ్వరి మంగళవారం సాయంత్రం తెలిపారు. సాఫ్ట్బాల్ బాలుర పోటీల్లో జి మోక్షిత్ రాయల్, ఎన్. ప్రతాప్, బేస్ బాల్ బాలుర పోటీల్లో కే.వంశీ, ఎస్.బన్నీ ఎస్.అజయ్ నాయక్, బేస్ బాల్ బాలికల పోటీల్లో టి.వెన్నెల, కే.మంజులబాయి, జి.లిల్లీ, సాఫ్ట్బాల్ బాలికల్లో ఎన్.సంధ్య, కె.మోహన్ రూప, ఆర్ట్స్ కళాశాలలో జరిగిన అండర్-19 ఖోఖో పోటీల్లో విజయ్, కే.మోహన్ రూప, త్రోబాల్ పోటీల్లో టి. అంజలి, యోగాలో టి.వెన్నెల, అథ్లెటిక్స్‌లో హై జంప్‌లో బాలికల పోటీల్లో జిల్లా స్థాయిలో టి.వెన్నెల మూడో స్థానం, 200మీటర్ల పరుగు పందెంలో మూడవ స్థానంలో కే.మోహన్ రూప, 400మీటర్ల పరుగు పందెంలో టి.వెన్నెల ప్రతిభ కనపరిచారని తెలిపారు.

ప్రజా వ్యతిరేక విధానాలు విరమించుకోవాలి

విశాలాంధ్ర-రాప్తాడు: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలని, రైతుల మోటార్లకు మీటర్లు బిగించరాదని ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి పోతలయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏపీ రైతు సంఘం, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో బ్లాక్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నల్ల రిబ్బన్ల తో కళ్ళకు గంతులు కట్టుకుని మోకాళ్లపై నిరసన తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను విరమించుకోవా లన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి అని అన్నారు. లక్కీమ్ పూర్‌లో రైతులు మరణానికి కారణమైన కేంద్రమంత్రి అజయ్ కుమార్ మిశ్రాను మంత్రి వర్గం నుండి తొలగించాలని. ఆశిష్ మిశ్రాపై చట్టపరమైన కేసు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, సుబ్బిరెడ్డి, కొండారెడ్డి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

04న విడపనకల్‌లో జగనన్నకు చెబుదాం

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం : విడపనకల్ మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం ఉదయం 10:00 గంటల నుంచి జగనన్నకు చెబుదాం, స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొంటారని, కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

5న పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అవగాహన

విశాలాంధ్ర-బ్రహ్మసముద్రం : పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 5న అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ గుప్తా మంగళవారం ఓ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిధిలోని పాడి రైతులు, గొర్రెల పెంపకం,, మేకలు పెంపకం పందులు తదితర వాటిపై ఆసక్తి గలవారు 5వ తేదీ జిల్లా కేంద్రంలోని సాయిబాబా కళ్యాణమండపం నందు హాజరు కావాలన్నారు. పెంపకంపై అవగాహన బ్యాంకు సబ్సిడీ తదితర వాటిని రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

కేంద్ర మంత్రి అజయ్‌మిశ్రాను కేబినెట్ నుండి తొలగించాలి

- లఖీంపూర్ రైతుల ప్రాణాలు తీసిన మంత్రిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- రైతు,కార్మిక, కర్షక,సంఘాల సమన్వయ కమిటీ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: లఖింపూర్ రైతుల ప్రాణాలు తీసిన కేంద్ర మంత్రి అజయ్‌మిశ్రాను క్యాబినెట్ నుండి వెంటనే బర్తరఫ్ చేయాలని అనంతపురం జిల్లా రైతు, కార్మిక, కర్షక సంఘాల సమన్వయ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు.ఈ మేరకు మంగళవారం అక్టోబర్ 3వ తేదీని బ్లాక్ డే గా పాటిస్తూ కృష్ణ కళామందిరం నుండి టవర్ క్లాక్ వరకు రైతులు, కార్మికులతో కలిసి నిరసన ర్యాలీ చేపట్టారు. జిల్లా రైతు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున,ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, ఏఐకెఎస్ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, సీపీఎం అనుబంధం ఏపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్రెడ్డి, సీపీఐ అనుబంధం ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నప్ప యాదవ్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రైతు కూలీ సంఘం కార్యదర్శి చంద్ర శేఖర్, సీఐటీయు జిల్లా అధ్యక్షురాలు నాగమణి మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌లో కేంద్రమంత్రి అజయ్ మిశ్రా కుమారుడు కారుతో గుద్దించి రైతుల మృతి కారకుడయ్యాడని ఆయనను అరెస్టు చేయాలన్నారు. మూడునల్ల వ్యవసాయ చట్టాలను రద్దు చేస్తూ కేంద్రం రైతులకు లిఖిత పూర్వకంగా హామీ ఇవ్వాల న్నారు. పంటలకు మద్దతు ధర కల్పించాలని, కార్మికులకు వ్యతిరేకంగా మారిన నాలుగు లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలన్నారు. కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని, ఏపీ రైతులకు కేరళ తరహా రుణ విమోచన చట్టం తీసుకురావాలన్నారు. వ్యవసాయ విద్యుత్ మోటార్లకు మీటర్లు పెట్టే విధానానికి స్వస్తి పలకాలని, పార్లమెం ట్లో పెట్టిన విద్యుత్తు బిల్లును ఉపసంహరించుకోవా లని డిమాండ్ చేశారు. సి ప్లస్ 20 డాక్టర్ ఎమ్మెస్ స్వామినాథన్ కమిటీ సిఫార్సులను తక్షణమే అమలు చేయాలన్నారు. ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్‌ను 2 లక్షల కోట్లకు పెంచాలని వ్యవసాయ కార్మికులకు 200 రోజుల పని దినాలు కేటాయిస్తూ 600 వేతనం ఇవ్వాలన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, ప్రతి రైతుకు నెలసరి పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వామపక్ష జిల్లా రైతు, కార్మిక సంఘాల నాయ కులు ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్ నాయ కులు క్రిష్ణుడు, మల్లికా ర్జున, రాజు, వెంకట నారా యణ, మనోహర, మధు యాదవ్, రాము, చలపతి, చంద్రశేఖర్, గోపాల్, రామాంజనేయులు, గోపాల్, కృష్ణ, రాయుడు, బాలరంగయ్య, రాయుడు, కృష్ణ మూర్తి, రామకృష్ణారెడ్డి, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ఫిర్యాదులపై పరిశీలన చేపట్టాం

- కలెక్టర్ ఎం.గౌతమి

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుండి మంగళవారం ప్రత్యేక ఓటర్ల సవరణ జాబితా కార్యక్రమం - 2024, రాజకీయ పార్టీలు సమర్పించిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, అనోమలిస్, చనిపోయిన, డూప్లికేట్, బదిలీ చేయబడిన, నకిలీ ఓటర్ల జాబితాల వెరిఫికేషన్, ఎపిక్ కార్డ్ జనరేషన్, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్ష నిర్వహించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని వీసీ హాల్ నుంచి వీసీలో కలెక్టర్ ఎం.గౌతమి, డీఆర్ఓ గాయత్రీ దేవి, తదితరులు పాల్గొన్నారు. వీసీలో ఆర్డీఓలు నిశాంత్‌రెడ్డి, రవీంద్ర, హెచ్ఎన్ఎస్ఎస్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, ఈఆర్ఓలు వెంకటేశ్వర్లు, ఆన్‌సెట్ సిఈఓ కేశవనాయుడు, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసిల్దార్ కనకరాజు, ఎన్నికలు విభాగం సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్ పాల్గొన్నారు.

పలువురు యువకులు బివైపిలో చేరిక

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని కృష్ణాపురం జీరో రోడ్డులో ఉన్న భారత చైతన్య యువజన పార్టీ కార్యాలయం వద్ద మంగళవారం యాడికి మండలం కమలపాడు గ్రామ యువ కులు దాదాపు 10 కుటుంబాలు భారత చైతన్య యువజన పార్టీ లో చేరినటు ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ డాక్ రాజ్ యాదవ్ చెప్పారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన యువకులు మాట్లాడుతూ ఎన్ని పార్టీలు వచ్చిన ప్రజల వద్ద నుండి దోచుకుండేది ఎక్కువ ప్రజలకు సేవ చేసేది కొంచెమే అన్నారు. అలాంటి సమయంలో బోడె రామచంద్ర యాదవ్ పార్టీ స్థాపించి ఆయన పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు మేలు చేసే విధంగా మేనిఫెస్టో ఉన్నదన్నారు. దీనికి ఆకర్షితులమై పార్టీలో చేరామని చెప్పారు. పార్టీలో మధుసూదన్ యాదవ్, ప్రకాష్, మనోహర్, ఆనంద్, గబ్బర్, గంగరాజు, రంగస్వామి తదితరులు చేరారు.

మెంటల్ ముఖ్యమంత్రిని సాగనంపుదాం : కాలువ పిలుపు

విశాలాంధ్ర-బొమ్మనహాల్: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పైశాచిక ఆనందానికి, నిరంకుశత్వానికి ముగింపు పలకాలని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. చంద్రబాబు నాయుడి అక్రమ అరెస్టును నిరసిస్తూ, మంగళవారం ఉదయం ఆయన బొమ్మనహాల్ మండల కేంద్రం నుండి నేమకల్లు వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్ర లో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. ముఖ్యంగా వందలాది మంది మహిళలు ఎనిమిది కిలోమీటర్ల మేర కదం తొక్కారు. చంద్రబాబుకు మంచి జరగాలని నేమకల్లు ఆంజనేయుడుకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన విలేఖర్లతో మాట్లాడారు. సర్వోన్నత న్యాయస్థానంలో మంగళవారం జరిగిన కేసు విచారణలో చంద్రబాబు నిర్దోషిగా బయటకు వస్తారని ఆశించామన్నారు. అయితే కేసు విచారణ మళ్లీ వాయిదా పడటం తమను బాధించిందన్నారు. ఆలస్యం కావొచ్చేమో కానీ, ఖచ్చితంగా చంద్రబాబుకు న్యాయం జరుగుతుందని తాము దృఢంగా విశ్వసిస్తు న్నామన్నారు. అవినీతి పరుడు జగన్మోహన్ రెడ్డి పాలనలో చట్టం, న్యాయం, ధర్మం పూర్తిగా పాతాళానికి తొక్కబడ్డాయని మండిపడ్డారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు బలరామిరెడ్డి, హనుమంతరెడ్డి, కురుబ హనుమంతు, బసప్ప, మాజీ మార్కెట్‌యార్డ్ చైర్మన్ చంద్రహాస్, కొత్తపల్లి మల్లికార్జున,కేషప్ప, నవీన్, బాబు పయ్యావుల అనిల్, దేవేంద్రప్ప, అప్పారావు, ఎల్‌బి నగర్ ధనుంజయ్య, వెంకటేశులు ద్విసభ్య కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి, శ్రీధర్ చౌదరి, రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, కౌన్సిలర్ ప్రశాంతి, బండి భారతి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును విడుదల చేసే వరకు విశ్రమించం

విశాలాంధ్ర- అనంతపురం రూరల్: మాజీ సీఎం చంద్రబాబు నాయుడిని వైసీపీ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపించిందని, ఆయనను విడుదల చేసే వరకు పోరాటాలను ఆపేది లేదని నియోజక వర్గం రైతు సంఘం అధ్యక్షుడు మారినేని లక్ష్మీ నారాయణ స్పష్టం చేశారు. సిండికేట్ నగర్‌లో మంగళవారం రిలే దీక్షలు చేశారు. రాజకీయ కక్షతోనే చంద్రబాబును జైలుకు పంపారన్నారు. దీక్షల్లో బాలేపాళ్యం ధనలక్ష్మి, బీకే రాజేశ్వరి, మల్లెల జయరాం, కొడిమి కాలనీ మహేష్, కృష్ణమరెడ్డిపల్లి తిరుపతయ్య, రంగయ్య, నామాల రామసుబ్బమ్మ, సర్దానప్ప పాల్గొన్నారు.

హంద్రీనీవా నీటిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేస్తాం

- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

విశాలాంధ్ర-బెలుగుప్ప: మండలం అంకంపల్లి పంప్ హౌస్ నుండి శీర్పి, బెలుగుప్ప చెరువులకు నీరు విడుదల చేసిన మాజీ ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు హంద్రీనీవా నీటిని ఒక ప్రణాళిక ప్రకారం రైతుల ఆకాంక్షలకు అనుగుణంగా చెరువులు నింపి పూర్తి స్థాయిలో సద్వినియోగం చేస్తామని ఉరవకొండ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి చెప్పారు. బెలుగుప్ప మండలం అంకంపల్లి పంప్ హౌస్ నుండి శీర్పి ,బెలుగుప్ప చెరువులకు స్థానిక ప్రజాప్రతినిధులు, హంద్రీనీవా అధికారులతో కలిసి మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి నీరు విడుదల చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం స్విచ్ ఆన్ చేసి పంప్ హౌస్ నుండి హంద్రీనీవా నీటి విడుదల చేశారు. అనంతరం కెనాల్ వద్ద గంగ పూజ చేసి హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు బాగుండాలని, రైతు బాగుపడాలని సీఎం జగన్ అనుక్షణం కష్టపడుతున్నారన్నారు. ఈసారి వర్షాలు తక్కువైనప్పటికి అనంతపురం జిల్లాలో హంద్రీనీవా ద్వారా ఇప్పటికే అనేక చెరువులు నింపామన్నారు. మిగతా అన్ని చెరువులను కృష్ణా జలాలతో నింపుతా మన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పెద్దన్న, మండల కన్వీనర్ మచ్చన్న, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ దుద్దేకుంట రామాంజనేయులు, సహకార సంఘం అధ్యక్షుడు శివలింగప్ప, సర్పంచ్ రుద్రానంద, ఏపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసులు, ఈఈ రామకృష్ణ యాదవ్, డీఈ శ్రీనివాస్ నాయక్, ఏఎం ఆజం, హంద్రీనీవా సిబ్బంది, వైకాపా నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబుకు బెయిల్ రద్దయితే జగన్‌కు జైలే..

విశాలాంధ్ర- అనంతపురం: మాజీ సీఎం చంద్రబాబు అవినీతి అక్రమాలు చేయకపోయినా సీఎం జగన్మోహన్‌రెడ్డి అధికారమదంతో జైలుకు పంపించారని, బాబుకు బెయిలు రద్దయితే జగన్ కు జైలే గతి అని టీడీపీ అర్బన్ శ్రేణులు హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి ఆదేశాల మేరకు నగరంలో 22వ రోజు రిలే నిరాహార దీక్షలను మంగళవారం అరెకటిక కులస్తుల ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ వ్యవస్థలు మేనేజ్ చేస్తూ పదేళ్లుగా బెయిల్ మీద ఉన్న జగన్ తనలాగే చంద్రబాబుపై బురదజల్లేలా అవినీతి, ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌తో సీఎం జగన్ శిక్ష తప్పదని, వచ్చే అర్నెల్లలో టీడీపీ అధికారం లోకి వస్తుందని, జగన్ అక్రమాలపై దర్యాప్తు జరిపి జైలుకుతామన్నారు. చంద్రబాబుకు జరిగిన అన్యాయాన్ని, ప్రపంచమంతా ఖండిస్తోందని, అందరి శాపాలు జగన్ కు పాపాలుగా మారతాయన్నారు. దీక్షలో మాజీ కార్పొరేటర్ సీసాల శీన, బాబ్జి, అశోక్, నాగేంద్ర బాబ్జి, అశోక్, నాగేంద్ర, రాజేష్, శ్రీకాంత్, శ్రీధర్, ఆనందరావు, షబ్బీర్, విష్ణు సాయి, బాలు, నల్లప్ప పాల్గొన్నారు. వీరికి రిటైర్డ్ ఎస్పి షేక్షావలి, నరిపూటి రమణ, నారాయణ స్వామి యాదవ్, రాజారావు, జేయం భాష, గొల్ల సుధాకర్ నాయుడు, బాలప్ప, సున్నం శ్రీనివాసులు, వెంకటరాముడు గౌడ్,ఉప్ప శీనా, చెరుకూరి సుధాకర్, పరశురాం, పరంధామ, సీనానాయక్, గుండప్ప, వడ్డే మురళి, గంగవరం అంజి, సరిపూటీ శ్రీకాంత్, కుల్లాయప్ప,మంజు, అంజలి, మల్లిక చౌదరి, అలివేలమ్మ, తదితరులు సంఘీభావం తెలిపారు.

చంద్రబాబు అక్రమ అరెస్టుపై మోకాళ్లపై నిలబడి నిరసన

విశాలాంధ్ర-ఉరవకొండ : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడానికి ఏకిల నాయుడు కుల సంఘం తెలుగుదేశం పార్టీ నాయకులు తీవ్రస్థాయిలో ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఉరవకొండలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం టిడిపి ఏకిల నాయుడు కులం నాయకులు చెవిలో పువ్వులు పెట్టుకొని మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతూ 21వ రోజు రిలే నిరాహార దీక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి పార్టీ ఓడిపోతుందని తెలిసి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఓటమి భయంతోనే చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేసినట్లు ఆరోపించారు. కార్యక్రమంలో టిడిపి పార్టీ ఏకిల నాయుడు కుల సంఘం నాయకులు బండారు సుధాకర్ నాయుడు, గూండాల శివయ్య చింతల నాయుడు, మరుట్ల ప్రభాకర్, గోవిందరాజులు, ఎర్రిస్వామి సురేష్, రామకృష్ణ, నల్లప్ప,సుధాకర్ నాయుడు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

విశాలాంధ్ర-తాడిపత్రి: మండలంలోని యర్రగుంటపల్లి, బొందలదిన్నె యూనిట్ లోని రావివెంకటంపల్లి,బొందలదిన్నె గ్రామాలలో జర్మనీ టీం సభ్యులు క్షేత్ర స్థాయిలోని పొలాలను సందర్శించారు. డిపిఎం లక్ష్మా నాయక్ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన రైతు కొండయ్య, బాబు, సత్యనారాయణ రావు, ఆవుల కొండారెడ్డి, ప్రహ్లాదరెడ్డి అరటి పంటలను పరిశీలించారు. అలాగే రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన మోడల్స్ ఏటీఎం మోడల్, ఏ గ్రేడ్ మోడల్, డ్రాట్ ప్రూఫింగ్ మోడల్ (బీడు భూమిని సాగు భూమి చేసే విధానం) కాటన్ మోడల్స్ వేసిన రైతులతో మాట్లాడి వారు పాటించిన పద్ధతులు గురించి తెలుసుకున్నారు. బీడు భూమిలో వేసిన విధానం 3 పొడవు 3 వెడల్పు అడుగులకు ఒకటి గుంత తీసి బీజామృతంతో విత్తనశుద్ధి చేసి విత్తనాల తోపాటు ఘన జీవామృతం, ద్రవ జీవామృతం వేస్తూ సోయింగ్ చేయు విధానం గురించి రైతులు జర్మనీ టీం సభ్యులకు తెలియజేశారు. కార్యక్రమంలో జర్మనీ టీం సభ్యులు శ్రీవిన బుర్స్, వైదేహి గుహిల్, సుధాకర్ మహమ్మద్ సాహిల్ రైతులు పాల్గొన్నారు.

ఏపీ వ్య.కా.సం నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-శింగనమల: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీ మంగళవారం ఏకగ్రీవంగా ఎంపిక జరిగింది. ఈ కార్యక్రమం నార్పల మండలం సిపిఐ కార్యవర్గ సభ్యులు ఎస్, సుధాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి టి. నారాయణస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం డిప్యూటీ ప్రధాన కార్యదర్శి డి.పెద్దయ్య, మండల సిపిఐ కార్యదర్శి గంగాధర్, నియోజవర్గ అధ్యక్ష కార్యదర్శులు, పెద్దిరాజు, శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నారాయణస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డి.పెద్దయ్యలు మాట్లా డుతూ రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ భూమిని పేదలకు పంపిణీ చేయడంతో పాటు కోనేరు రంగారావు భూ కమిటీ సిఫారసులు అమలు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల ఆర్థిక పరిస్థి తిని మెరుగు పరిచేందుకు ఎలాంటి సంక్షేమ కార్యక్ర మాలు తీసుకురాకపోగా ఉన్న చట్టాలను నీరుగారు స్తున్నారని, ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయా లని, కేంద్ర ప్రభుత్వం చూస్తుంటే దానికి రాష్ట్ర ప్రభుత్వం వత్తాసు పలుకుతూ ఉపాధి హామీ పథకం నిధులను ఇతర పనులకు ఉపయోగిస్తున్నదని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. జాబుకార్డ్‌లో ఉన్న ప్రతి ఒక్కరికి 200 రోజులు పని దినాలు కల్పించి రోజు వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు, ఏపీ వ్య.కా.సం. జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ డి.పెద్దయ్య నార్పల మండలం 9 మందితో నూతన కమిటీని ఎన్ను కున్నారు. ఏపీ వ్యవ సాయ కార్మిక సంఘం నార్పల మండల అధ్యక్షులుగా ఎస్.కాటమయ్య, మండల ప్రధాన కార్యదర్శిగా పి.పెద్దపెద్దయ్య, ఉపాధ్యక్షులుగా నారాయణప్ప, జాయింట్ సెక్రటరీగా సూరి, మండలకమిటీ సభ్యులుగా, శివ శంకర, తిమ్మిరాజు, ఆంజనేయులు, శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శులు రామాంజనేయులు, రమేష్, పార్టీ సీనియర్ నాయకులు, సుధాకర్, నాగరాజు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో కందిపప్పు పంపిణీ చేయాలి

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ప్రభుత్వ రేషన్ షాపుల్లో రేషన్ కార్డ్దారులకు కందిపప్పు పంపిణీ చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సిఎస్డిటి రాజాకు వినతిపత్రం అందజేశారు. గతంలో ప్రభుత్వ రేషన్ షాపుల్లో ప్రతి కార్డుదారునికి కందిపప్పు పంపిణీ చేస్తూ ఉండేది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపుల్లో కందిపప్పును ఆపేయడం వల్ల పేదలు బయట మార్కెట్లో కొనలేని దుస్థితి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రేషన్ షాపుల్లో కంది పప్పును కార్డుదారులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రజక చేతి వృత్తిదారుల సమైక్య సంఘం నియోజకవర్గ కార్యదర్శి సాలవేముల నూరి, ఏఐటీయూసీ రమణ, పట్టణ సహాయ కార్యదర్శులు, శ్రీరాములు, రామంజి, శీనా, నాగేంద్ర, రత్నమయ్య, అబ్రహం, నాయక్, సంజన పాల్గొన్నారు.

పాల ఏకిల నాయుడు సంఘం భారీ ప్రదర్శన

విశాలాంధ్ర-ఉరవకొండ : టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా పాలఏకిలా నాయుడు సోదరులు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉరవకొండలో భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. స్థానిక టవర్ క్లాక్ సమీపం నుంచి రిలే నిరాహార దీక్ష శిబిరం వరకు నల్లజెం డాలతో భారీ ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అన్యాయంగా అక్రమంగా దొంగ కేసులు పెట్టి చంద్రబాబుని జైల్లో పెట్టారని ఆరోపించారు కార్యక్రమంలో పాలఏకిల నాయుడు సాధికారిక సమితి డైరెక్టర్లు సుధాకర్ నాయుడు,చింతల నాయుడు, మరుట్ల ప్రభాకర్, ఈడిగా సాధికారిక సమితి నాయకులు గోపాల్ గౌడ్ పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలివ్వాలి

విశాలాంధ్ర బ్యూరో–శ్రీ సత్యసాయి: అర్హులైన నిరుపేదలందరికీ నివాస స్థలాలు ఇవ్వాలని చెన్నై కొత్తపల్లి మండలంలో మంగళవారం సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనంతరం తాసిల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏ కాటమయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బెల్లం మహదేవ్, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జెవి రమణ మాట్లాడుతూ చెన్నై కొత్తపల్లి మండలం న్యామద్దల గ్రామ పంచాయతీలో వందలాది మంది పేదలు శాశ్వత గృహవాసతి లేక అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇల్లు లేని ప్రతి పేదవాడికి 90 రోజులలో శాశ్వత గృహ వసతి ఏర్పాటు చేయగలమని హామీ ఏమాత్రం నెరవేర్చడం లేదని కేవలం మాటలకు మాత్రం పరిమితం ప్రభుత్వం అయినదని, న్యామద్దల గ్రామపంచాయతీలోని పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని అనేక సంవత్సరాలుగా సిపిఐ మండల పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంబంధించిన అధికారులకు అనేక రకాలుగా వినతిపత్రలు ఇచ్చామని, అయినా ఇప్పటివరకు ఎటువంటి ఫలితం లేనందున న్యామద్దల గ్రామపంచాయతీ పరిధిలో గల 224/1 ప్రభుత్వ భూమిలో భూ పోరాటం కొనసాగించామని తెలిపారు. ప్రభుత్వానికి సంబంధించిన భూమిలో పేదలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలకు అనుకూలమైన ప్రదేశంలో ఇంటి పట్టాలు మంజూరు చేసి వారికి శాశ్వత గృహ వసతి కల్పించాలన్నారు. అలాకాని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో పేదల కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ భూములను పేదలకు ఇంటి స్థలాలకు కాకుండా పెద్దలు ఆక్రమించుకుంటే సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేసి ఆ భూములను పేదలకు వచ్చేంత వరకు పోరాటాలు కొనసాగిస్తామని వారు తెలిపారు.. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మంగళ నాగరాజు, రైతు సంఘం మండల అధ్యక్షులు ముత్యాలప్ప, సిపిఐ మండల కమిటీ నాయకులు అగ్గి రాము, నరసింహులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

కేంద్ర మంత్రి అజయ్‌మిశ్రాను భర్తరఫ్ చేయాలి

ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాటమయ్య

విశాలాంధ్ర బ్యూరో– శ్రీ సత్యసాయి: చెన్నై కొత్తపల్లి మండల కేంద్రంలో మంగళవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో లఖింపూర్ రైతుల ప్రాణాలు తీసిన కేంద్ర మంత్రి అజయ్ మిశ్రాను, క్యాబినెట్ నుండి వెంటనే బర్తరఫ్ చేయాలని , రైతుల మరణానికి, కారణమైన అతని కుమారుడిని వెంటనే శిక్షించాలని రైతు కార్మిక కర్షక సంఘాల సమన్వయ జిల్లా కమిటీలు, రైతులు, మహిళా రైతులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్య క్షుడు, కాటమయ్య మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్లో శాంతియుతంగా నిరసన చేస్తున్న రైతులపై, కేంద్ర మంత్రి అజయ్‌మిశ్రా కుమారుడు కార్‌తో గుద్దిచంపి, రైతుల మృతికి కారకుడ య్యాడని అతడిని అరెస్టు చేయాలని, కేంద్ర మంత్రిని మంత్రివర్గం నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లా గౌరవ అధ్యక్షుడు జెవి రమణ, బెల్లం మహాదేవులు మాట్లాడుతూ మూడు నల్ల వ్యవసాయ చట్టాలు రద్దు, పంటలకు మద్దతు ధర కల్పించాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలని వ్యవసాయ విద్యుత్ మోటార్లకుమీటర్లు పెట్టే విధానానికి స్వస్తి పలకాలని, పార్లమెంట్లో పెట్టిన విద్యుత్ బిల్లును, ఉపసంహరించుకోవాలని, ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్లకు పెంచాలని, రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శుడు ముత్యాలప్ప, నాయకులు అగ్గిరాము, నరసింహులు, పోలేపల్లి, ముత్యాలప్ప పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ చేయాలి..

– కలెక్టర్ పి.అరుణ్ బాబు

వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.అరుణ్ బాబు

విశాలాంధ్ర–పుట్టపర్తి: జిల్లాలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం చేపట్టామని కలెక్టర్ పి. అరుణ్ బాబు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు తెలిపారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై మంగళవారం రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయం నుండి రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో ఓటర్ల జాబితా సవరణపై తీసుకుంటున్న చర్యలు, కొత్త ఈ.వీ.ఎం. ఆక్సెప్టెన్స్ టెస్ట్ ప్రొసీజర్ పనులను ముఖేష్ కుమార్ మీనాకు తెలియజేసారు. ఈ సందర్భంగా ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ ఫారం 6,7,8 క్రింద వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, డ్రాఫ్ట్ నోటిఫికేషన్ తయారీకి చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల జాబితా స్వచీకరణకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రతీ వారం సమీక్షిస్తున్నామని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు నిమిత్తం ఫారం 6,7,8 లు దరఖాస్తులు అందాయని, వాటిలో 90 శాతం దరఖాస్తులు పరిష్కరించడం జరిగిందన్నారు. కొత్తగా వచ్చిన ఓటింగ్ మిషన్లు ఈఎంఎస్ ద్వారా స్కానింగ్6 తేదీ లోపు డెల్ ఇంజనీర్ సమక్షంలో, ఏటీపీ, ఈనెల 10న పూర్తి చేయడానికి చర్యలు చేపడుతున్నామన్నారు.

క్లెయిమ్స్ తక్షణమే పరిష్కరించాలి... రాజకీయ పార్టీలు సమర్పించిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, అనోమలిస్, చనిపోయిన, డూప్లికేట్, బదిలీ చేయబడిన, నకిలీ ఓటర్ల జాబితాల వెరిఫికేషన్, ఎపిక్ కార్డ్ జనరేషన్, తదితర ఆన్లైన్‌లో పెండింగ్ ఉన్న అంశాలను వెంటనే డిస్పోజ్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ కార్తీక్, డిఆర్ఓ కొండయ్య, ఆయా నియోజకవర్గాల ఎన్నికల అధికారుల పుట్టపర్తి భాగ్య రేఖ, ధర్మవరం తిప్పే నాయక్, కదిరి రాఘవేంద్ర, మడకశిర చిన్నయ్య, పుట్టపర్తి తాహసిల్దార్ కార్యాలయం ఎన్నికల విభాగం డిప్యూటీ తహసిల్దార్ నరసింహులు, కలెక్టరేట్ ఎన్నికలు సంబంధించిన డిప్యూటీ తహల్దారులు భాస్కర్, మైనా ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇంటి పథకం ఓ మాయాపథకం..

90 రోజుల్లో ఇంటి పట్టా ఎక్కడ..?

లబ్ధిదారులుగా గుర్తించిన వారికి పట్టాలు ఎందుకివ్వలేదు..

పట్టాలిచ్చిన వారికి ఇంటి నిర్మాణాలు ఎక్కడ..?

సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాంభూపాల్

విశాలాంధ్ర–చిలమత్తూరు: జగనన్న ఇంటి పథకం ఒక మాయ పథకం,90 రోజులలో ఇంటి పట్టాలు ఒట్టి మాటలే, వేలాది మంది పేదలు ఇంకా ఇంటిస్థలాలు ఇళ్లు లేని దుస్థితిలో ఉన్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ అన్నారు. మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో ముఖ్య అతిదిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం, అధికారులు ఎంతటి మాయనైనా చేయగలరు... ఇంటి పట్టాలు ఇస్తామని చెప్పి పెద్ద పెద్ద మీటింగ్ లు పెట్టి ఫొటోలకు ఫోజులిచ్చి ఇచ్చిన అర్థ గంటలకే పట్టాలను వెనక్కి తీసుకొని వైసిపి ఇంచార్జ్ వచ్చినాక ఇస్తామని మాయ చేసి మూడిన్నర ఏళ్లు అయినా పట్టాలిచ్చిన పాపాన పోలేదని అన్నారు. ఇప్పుడు ఎందుకు పట్టాలివ్వలేదని పేదలుగా ఉన్న లబ్దిదారులు అడిగితే కోర్టులో ఉందని చెప్పడం దుర్మార్గం అని అన్నారు.

గుడిసెలు వేసుకున్న చోటే ఇంటి పట్టాలిస్తాం :- కోడూరు లేఅవుట్‌లో ఇంటి స్థలాలకు లబ్దిదారులుగా ఉన్న వారికి అలాగే 90 రోజుల కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న అర్హులకు ఎక్కడైతే ఇంటి స్థలాల కోసం సర్వేనెంబర్ 805 లో గుడిసెలు వేసుకున్నారో అక్కడే పట్టాలు పేదలు కోరుతున్నారని అందుకు తాను అంగీకరిస్తున్నానని తహశీల్దార్ నాగరాజు తెలిపారు. రిజర్వ్ చేసిన భూమి కనుకపై జయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెల్లి వారి అనుమతి తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్,నల్లా లక్ష్మినారాయణ, సిఐటీయు జిల్లా నాయకులు పెనుకొండ రమేష్,ఆటో బాబావలీ, లక్ష్మినారాయణ, వెంకటేష్, రామచంద్ర, కమిటీ సభ్యులు సదాశివరెడ్డి, చందు, చరణ్, రహంతుల్లా, రియాజ్, శివ, మణిస్వామి పాల్గొన్నారు.

వారాహి యాత్రకు ఆటంకం కల్గిస్తే చూస్తూ ఊరుకోం..

జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి

విశాలాంధ్ర–ధర్మవరం : కృష్ణాజిల్లా పెడనలో వారాహి యాత్రకు బుధవారం వైసీపీ నాయకులు ఆటంకాలు కల్పిస్తే చూస్తూ ఊరుకునేది లేదని , ఏమైనా జరిగితే దానికి ముఖ్యమంత్రి బాధ్యత వహించాల్సి ఉంటుందని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో రాష్ట్ర ప్రజలందరూ విసుకు చెందారని, ప్రతిదీ ప్రజలు గమనిస్తున్నారని వారు గుర్తు చేశారు. అమలాపురంలో మాదిరిగా వైసీపీ వాళ్లు అల్లర్లు సృష్టించాలని చూస్తున్నారని అలాంటి వాళ్లను తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. 2024లో వచ్చేది జనసేన, టిడిపి ప్రభుత్వమేనని వైసీపీ నాయకులకు సవాల్ విసిరారు. జరగబోయే పరిమాణాలకు మీరే బాధ్యత వహించాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.

ప్రజలందరి ఆరోగ్యమే ముఖ్య లక్ష్యం

విశాలాంధ్ర–ధర్మవరం: ప్రజలందరి ఆరోగ్యమే జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ముఖ్య లక్ష్మణమని దర్శనమల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు పుష్పలత, దిలీప్ కుమార్, స్పెషలిస్ట్ డాక్టర్లు వినోద్, సుదీప్తి తెలిపారు. మంగళవారం పోతుకుంట గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ ఈ శిబిరంలో 314 మందికి ఉచిత వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులను కూడా అందించామని తెలిపారు. 80 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 40 మందికి అద్దాల పంపిణీ చేయడంతో పాటు పదిమందికి కంటి ఆపరేషన్లకు రెఫర్ చేయడంతో పాటు 110 మందికి ల్యాబ్ పరీక్షలు కూడా నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా క్షయ అధికారి తిప్పయ్య, డిప్యూటీ డీఎం ఎల్‌హెచ్‌ఓ సల్మాన్, ఎంపీడీవో సౌజన్యకుమారి, సిహెచ్‌ఓ కళావతి, ఆప్తాలమిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప, ఐదవ వార్డ్ సభ్యులు ఈశ్వ రయ్య, హెల్త్ సూపర్వైజర్లు రాజశేఖర్ రెడ్డి, జై తుంబి, సర్పంచ్ అంగజాల నాగవేణి పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికునికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర–ధర్మవరం: పట్టణంలోని మారుతీ నగర్ కు చెందిన భవన నిర్మాణ కార్మికుడు ప్రసాద్ ఇటీవల గణేష్ మండపంలో డాన్స్ చేస్తూ మృతి చెందాడు. సమాచారాన్ని అందుకున్న భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు ముక్తం ఈశ్వరయ్యతో పాటు సంఘం సభ్యులు మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. భవన నిర్మాణ కార్మిక సంఘంలోని ప్రతి ఒక్కరిని ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో యంబా లింగన్న, ముకుతం మణిదీప్, శంకు సుధాకర్, మాబువలి, గోవిందు, గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు వ్యాపార నైపుణ్యాలు పెంపొందిస్తాం..

మున్సిపల్ చైర్మన్ కాచర్ల లక్ష్మి

విశాలాంధ్ర–ధర్మవరం: పట్టణ మహిళలకు వ్యాపార నైపుణ్యాలను పెంపొందించి, తద్వారా సుస్థిర జీవనోపాధి కల్పన ఆర్థిక సాధికారతను సాధించుటయే ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ కాచర్ల లక్ష్మి తెలిపారు. మంగళవారం కౌన్సిల్ హాల్ లో పట్టణ మహిళా డ్వాక్రా సంఘం సభ్యులు ఆర్పీలకు"జగనన్న మహిళా మార్ట్"పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కాచర్ల లక్ష్మీ మాట్లాడుతూ అతి త్వరలో పట్టణంలోని కాయగూరల మార్కెట్‌లో గల మీసేవ కేంద్రం క్రింది భాగాన గల స్థానంలో "జగనన్న మహిళా మార్ట్"ఏర్పాట్లకు సర్వం సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ మహిళా మార్ట్ వలన నాణ్యమైన సరుకులతో పాటు తక్కువ ఖర్చుతో వివిధ రకాలైన సరుకులను కొనుగోలు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా, ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు మహిళా మార్పులు మార్ట్ ఆధ్వర్యంలో నెలకొల్పబడుతుందని తెలిపారు. జగనన్న మహిళా మార్ట్ దైనందిక కార్యక్రమాల నిర్వహణ కొరకు చట్టపరమైన అనుమతులు పొందుటకు 11 మందితో కార్యనిర్వాహక కమిటీని కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. 1300 సంఘముల మార్కెట్ వాటాధారులుగా ఉంటారని ఒక్కొక్క సభ్యులు రూ. 150లు పెట్టుబడిగా చెల్లిస్తారని తెలిపారు. మహిళల అభివృద్ధికి ఈ జగనన్న మహిళా మార్ట్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిటీ మిషన్ మేనేజర్ వెంకటేశులు, కమ్యూనిటీ కోఆర్డినేటర్ సుధాకర్, చాంద్ భాషా పాల్గొన్నారు.

చంద్రబాబును విడుదల చేసేదాక పోరాటం

సిపిఐ, జనసేన సంఘీభావం

విశాలాంధ్ర–పెనుకొండ: ఎలాంటి అవినీతి అక్రమాలు చేయ నీ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో పాటు వైసీపీ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపిందని ఆయనను విడుదల చేసే వరకు పోరాటాలు కొనసాగిస్తూ రిలే నిరాహార దీక్షలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న సిపిఐ జనసేన నాయకులతో కలిసి పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. టీడీపీ నాయకుల మీద కార్యకర్తల మీద వేధింపులు ఎక్కువయ్యాయని రాష్ట్ర మొత్తం మీద ఎవరు సమస్యలు ఉత్పన్నం చేస్తే వారి మీద కేసులు బనాయించడం వైసిపి ప్రభుత్వానికి అలవాటుగా మారిందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రోద్దం నరసింహులు, కార్యకర్తలకు ఉత్తేజపరితమైనటువంటి ప్రసంగాన్ని నిర్వహించారు. కేవలం రాజకీయ కక్ష కోసమే చంద్రబాబును అరెస్ట్ చేశారని ఇది దుర్మార్గమైనటువంటి చర్యగా భావిస్తున్నామని తెలిపారు. కార్యక్ర మంలో మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, కృష్ణమూర్తి, సిపిఐ డివిజన్ కార్యదర్శి శ్రీరాములు, జనసేన కుమార్, కమలమ్మ ,తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వా కార్యదర్శి జివిపి నాయుడు, కేశవయ్య, వెంకట్ రాముడు, టీడీపీ నాయకులు కార్యకర్తలు పార్టీ కన్వీనర్లు పాల్గొన్నారు.

చట్టపరంగానే మేము పోరాడుతాం..

మాజీ మంత్రి పరిటాల సునీత

విశాలాంధ్ర–ధర్మవరం: ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి, రాజకీయ అనుభవశాలి అయిన చంద్రబాబు నాయుడుని విడుదల చేసేంతవరకు మా పోరా టాలు ఆపమని మాజీ మంత్రి పరిటాల సునీత, టిడిపి జిల్లా అధ్యక్షులు బికే పార్థసారథి, ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ముస్లిం సోదర సోదరీమణులు చేపట్టిన నిరసన ర్యాలీలో పాల్గొన్నారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. తదుపరి ముస్లింలతో కలిసి దువా చేశారు. ధర్మవరంలో కదం తొక్కిన ముస్లిం సోదర సోదరీమణుల ర్యాలీ విజయవంతమైంది. అనంతరం పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, చిలకం మధుసూదన్ రెడ్డిలు మాట్లాడుతూ చంద్రబాబు క్షేమంగా బయటకు రావాలంటూ ముస్లింలు నిర్వహించిన ర్యాలీలో పాల్గొనడం మాకెంతో సంతోషంగా ఉందని తెలిపారు. ముస్లిం యువకులు పరిటాల శ్రీరాములును భారీ గజమాలతో సత్కరించారు. న్యాయం, ధర్మం ఎటువైపు ఉంటే ముస్లింలు అటువైపు ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, ఇన్‌చార్జిలు మాజీ ఎమ్మెల్యేలు, అభిమానులు, శ్రేయోభిలాషులు, వార్డు ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

ఆస్తి, నీటిపన్నులు సకాలంలో చెల్లించండి

– అభివృద్ధికి సహకరించండి

– మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

విశాలాంధ్ర–ధర్మవరం: ఆస్తి, నీటి పన్నులు సకాలంలో చెల్లించి, పట్టణ అభివృద్ధికి పట్టణ ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం వారు కార్యాలయంలో మాట్లాడుతూ ధర్మవరం పట్టణంలో ప్రజలు ఈ పన్నుల విషయంలో నిర్లక్ష్యంగా ఉండకుండా, సకాలంలో చెల్లించినప్పుడే పట్టణంలోని అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. పట్టణంలో 31,655 ఇల్లు ఉన్నాయని, వీటి ద్వారా ఆస్తి పన్నులు 8 కోట్ల 81 లక్షలు రావాల్సి ఉందని, ఈనెల రెండవ తేదీ నాటికి 2 కోట్ల 96 లక్షలు మాత్రమే రావడం జరిగిందన్నారు. ఇంకనూ 5 కోట్ల 85 లక్షలు రావాల్సి ఉందన్నారు. అదేవిధంగా నీటి పన్నులో 26,650 ఇళ్ల ద్వారా 9 కోట్ల 33 లక్షల 50 వేలు రావాల్సి ఉండగా, ఈనెల రెండవ తేదీ నాటికి ఒక కోటి 64 లక్షల 83 వేల రూపాయలు రావడం జరిగిందన్నారు. ఇంకను 7 కోట్ల 68 లక్షల 67,000 రావాల్సి ఉందని తెలిపారు. ఆస్తి పన్ను నీటి పన్ను ద్వారా కోట్ల రూపాయల్లో ప్రజల ద్వారా రావాల్సి ఉందని, పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాల అవసరం ఉన్నందున, వెనువెంటనే పన్నులు కట్టాలని తెలిపారు. పన్నులను ఆన్లైన్ ద్వారా గాని,, సచివాలయాల ద్వారా గాని, మున్సిపల్ కార్యాలయంలో నేరుగా గాని కట్టవచ్చన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

విశాలాంధ్ర–పుట్టపర్తి : బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో కోర్టులో రుజువు కావడంతో ఇరగ దిండ్ల గంగరాజు అనే నిందితుడికి 10 సంవత్సరాలు జైలు శిక్ష రూ.2 వేల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెల్లడించారు. గాండ్ల పెంట మండలం, సోమయాజులపల్లి పంచాయతీ ఎర్ర చేను పల్లి గ్రామవాసి ఇరగదిండ్ల గంగరాజు, తండ్రి నారాయణ ,అను అతను ఏడేళ్ల బాలికను తన తల్లిదండ్రులు లేని సమయంలో చాక్లెట్లు బిస్కెట్లు ఇప్పిస్తాను అని ఆశ చూపి పాడుబడిన ఇంటి గోడ వెనకకు తీసుకు వెళ్లి మానభంగం చేయడానికి ప్రయత్నించాడని అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. 3వ తేదీన ఫోక్సో కోర్టు జడ్జి, అనంతపురంలో నిందితుడి నేరం రుజువు కావడంతో 10 సంవత్సరం జైలు శిక్ష, రూ.2 వేల జరిమానాగా విధించి తీర్పు ఇచ్చారు. నిందితునికి శిక్షపడేలా చేసిన పోలీసులను ఎస్పీఎస్పీ మాధవ్ రెడ్డి అభినందించారు.

నేడు తపాలా ఉద్యోగుల సమ్మె

విశాలాంధ్ర - హిందూపురం : గ్రామీణ తపాలా ఉద్యోగులకు 8 గంటల పని కల్పించాలని, సినీయర్ ఉద్యోగులకు 12, 24, 36 ఏళ్ల సర్వీసుకు అదనపు ఇంక్రిమెంటు కల్పించాలని. గ్రూపు ఇన్సూరెన్స్ 5 లక్షలకు పెంచాలని, కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సు చేసిన అన్ని రకాల సానుకూల సిఫారసులను అమలు చేయాలని కోరారు. నేటి సమ్మెలో హిందూపురం డివిజన్ తపాలా ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని డివిజన్ జేఏసీ నాయకులు కార్యదర్శి నరసిం హులు, జనార్ధన్, ప్రభాకర్ అబ్దుల్ మునాఫ్, నాగరాజ కోరారు.

రాష్ట్ర ప్రజల ఆరోగ్యం కోసమే..

విశాలాంధ్ర–గోరంట్ల: రాష్ట్ర ప్రజల అభివృద్ధి ఆరోగ్యం సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిత్యం కృషి చేస్తున్నారని, ప్రజల బాగు కోసమే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి గడపకు తీసుకెళ్తూ అన్ని సచివాలయ కేంద్రాలలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని జిల్లా వైసీపీ అధ్యక్షులు పెనుకొండ ఎమ్మెల్యే మాల గుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. మంగళవారం 1వ సచివాలయం నందు వైద్య సిబ్బంది అన్ని రకాల వ్యాధులకు చికిత్సలు నిర్వహించారు.

దీపం కోసం.. దానం చేసిన రాజులు

● అతిపెద్ద శిలా శాసనం పరిశీలన..

● తుళువ వంశ ప్రభువులు గొప్ప పాలన అందించారు

●చరిత్రకారుడు మైనాస్వామి వెల్లడి..

విశాలాంధ్ర–లేపాక్షి: పూర్వం దేవాలయాల నిర్మాణం చేయడమే కాకుండా వాటి నిరంతర దీప ధూప నైవేద్యం కోసం అప్పటి రాజులు ఎన్నో రకాలుగా దానాలు చేసి నేడు శిలా శాసనాలు చరిత్రలో నిలిచారు. తుళువ వంశ ప్రభువులు గొప్ప పాలన అందించారని, రాజ్యాన్ని విస్తరించడానికి చేర, చోళ, పాండ్య, బహుమని సుల్తానులు, గజపతులు వంటి రాజులను ఓడించినట్టు శాసనం చెబుతుందని చరిత్రాకారుడు మైనాస్వామి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతు లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయం రెండవ ప్రాకార గోడపై తుళువ వంశ ప్రశస్తి శాసనంగా గుర్తించినటు తెలిపారు. లేపాక్షిలోని అన్ని శాసనాలకంటే తుళువ వంశ ప్రసస్తి చాలా పెద్దదన్నారు. ఆలయ నిర్మాణానికి సాయపడిన విజయనగర సామ్రాజ్య చక్రవర్తి అచ్యుతరాయలు క్రీస్తు శకం 1533లో శాసనాన్ని రాయించ దన్నారు. శాసనలిపి కన్నడ కాగా అందులోని భాషా సంస్కృతం అచ్యుత రాయలు హయాంలో ఉన్న సంస్కృత కవయిత్రీ తిరుమలమ్మ ఆ శాసనాన్ని రూపొందించినట్టు తెలుస్తోందన్నారు. పురాణా ప్రభువులు బుధుడు, పురూర వుడు, తురువశుడు, యయాతి తదిత రులు తమ వంశానికి మూల పురు షులని అచ్యుతరాయలు చెప్పు కున్నాడు. తిమ్మభూపతి, దేవకిదేవి, ఈశ్వర నాయకుడు, ముక్కమాంభ, నరస నాయకుడు, తిప్పాంభ, నాగ లాంబ, ఓబాంబ, నరసింహ రాయులు శ్రీకృష్ణ దేవరాయల తదితర పేర్లు శాసనంలో ఉన్నట్టు మైనాస్వామి వివరించారు. విజయ నగర సామ్రాజ్యంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలు తిరుమల, హంపి, శ్రీకాళహస్తి, కంచి, శ్రీరంగం కుంభ కోణం, శ్రీశైలం, మహానంది, హరిహర, గోకర్ణ, లేపాక్షి తదితర ఆలయాలకు భూము లను, బంగారు విరివిగా దానం చేసినట్లు అచ్యుతరాయల శాసనం తెలుపుతుందన్నారు. భూములు, సువర్ణదానంతో పాటు వేలాది గోవులను ఆలయాలకు బహూకరించారు. ఆ దానాల వల్ల రాజ్యంలోని ఆలయాలు నిత్యదీప, దూప, నైవేద్యాలతో కళకళాడమే కాకుండా భక్తులకు నిత్యాన్నదానాన్ని అందించాయని తెలిపారు.

శ్వాస మీద ధ్యాస అలవర్చుకోవాలి

సినీ ఫైట్ మాస్టర్స్ రామ్, లక్ష్మణ్

విశాలాంధ్ర–ధర్మవరం: ప్రతి ఒక్కరూ శ్వాస మీద ధ్యాసను అలవర్చుకుంటే క్రమశిక్షణతో కూడినటువంటి జీవితం లభ్యమవుతుందని సినీ ఫైట్ మాస్టర్స్- రామ్, లక్ష్మణ్ పేర్కొన్నారు. మంగళవారం ధర్మవరం సబ్ జైల్లో ఉండే ఖైదీలకు "ధ్యానం వలన కలుగు ప్రయోజనాలు" అను అంశంపై అవగాహన కల్పించారు. రామ్ లక్ష్మణ్ మాట్లాడుతూ ధ్యానం చేయడం వల్ల నిబద్ధత, మాటలో స్పష్టత, చేసే పనిలో స్వచ్ఛత, మంచి వ్యక్తిత్వం, ఆరోగ్యం పదిలంగా ఉంటుందని తెలిపారు. మానవ శరీరంలో తెలిసి తెలియనీ రుగ్మతలు ఉన్న ఎడల ఉదయము, సాయంత్రం ధ్యానం చేయడం వల్ల నివారించవచ్చునని తెలిపారు. ఖైదీలుగా తెలిసీ, తెలియక తప్పులు చేసి శిక్షను అనుభవించడం బాధాకరమైనదని, చేసిన తప్పును సరిదిద్దు కోవడం జ్ఞానం అని, అదే తప్పును పదేపదే చేయడం దాన్ని అజ్ఞానం అని తెలిపారు. తదుపరి రామ్ లక్ష్మణులు ఖైదీలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ ధ్యానం శిక్షణ మాకెంతో సంతోషాన్ని ఇచ్చిందని ఖైదీలు తెలిపారు. కార్యక్రమంలో సబ్ జైల్ సూపరిడెంట్ బ్రహ్మారెడ్డి, పిరమిడ్ ధ్యాన కేంద్రం బండి రాము, నార్పల శివ, సబ్ జైలు సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వం హయాంలోనే మైనార్టీల అభివృద్ధి

విశాలాంధ్ర–గోరంట్ల: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముస్లిం మైనార్టీల అభివృద్ధి కోసం తీవ్రంగా కృషి చేస్తున్నారని పెనుకొండ శాసనసభ్యులు మాల గుండ్ల శంకర్ నారాయణ పేర్కొన్నారు, ఈ సందర్భంగా మంగళవారం గోరంట్ల పట్టణంలోని హిందూపురం గోరంట్ల ప్రధాన రహదారి నుండి ముస్లిం స్మశాన వాటిక వరకు ఎంపీ నిధులతో 40 లక్షల వ్యయంతో 400 మీటర్ల సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు, ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీల అభివృద్ధికి కావలసిన సౌకర్యాలను కల్పించేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ పెద్దలు ఎమ్మెల్యేకు ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.